క్లుప్తంగా

ఆకట్టుకున్న సైన్సు ప్రదర్శన

పెడన: విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడానికి సైన్సు ప్రదర్శనలు ఎంతగానో ఉపకరిస్తాయని ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ చైర్మన్ వి.సుందర రామ్ అన్నారు. పట్టణంలోని విశ్వభారతి హైస్కూలులో సోమవారం సైన్సు ప్రదర్శనలను ఆయన ప్రిన్సిపాల్ ఏవీజీ గౌరీప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. సుందరరామ్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రస్తుతం శాస్త్రీయ విజ్ఞానం చాలా ముఖ్యమన్నారు. విద్య, వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా ఈ శాస్త్రీయ విజ్ఞానం లభిస్తుందని తెలిపారు. సైన్సు ఉపాధ్యాయులు ఏజే పార్వతీ, ఆర్‌ధనలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లే అవుట్లలో సమస్యల పరిష్కారం

చిరువోలు(మోపిదేవి): జగనన్న లే అవుట్లలో సమస్యలు పరిష్కరించి త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తిచేసేందుకు గ్రామస్తులు సహకరించాలని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు కోరారు. మండల పరిధిలోని మెరకనపల్లి శివారు చిరువోలులో జగనన్న లే అవుట్-4ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లే అవుట్లలోని లబ్ధిదారులతో సమావేశమై చర్చించారు. గ్రామస్తుల అభిప్రాయాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఏఎంసీ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరావు, ముత్యాల గోపాలరావు, గృహనిర్మాణశాఖ మండల ఏఈ తాండవకృష్ణ, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరావు, వీఆర్వో సుబ్బారావు లబ్ధిదారులు పాల్గొన్నారు.

జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్‌లు

అవనిగడ్డ: కోడూరు మండలం విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ జాతరకు అవనిగడ్డ నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. సాధారణ చార్జీలతోనే ఈ సర్వీసులు నడుపుతున్నామని, భక్తులు ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు.

ఘనంగా గంగానమ్మ జాతర

పెదప్రోలు(మోపిదేవి): మండల పరిధిలోని పెదప్రోలు గ్రామంలో ప్రధాన సెంటర్‌లో గంగానమ్మ జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ఘటంకుండతో బయటకు తీసి మేళతాళాలు, డప్పుకళాకారులసందడితోఉత్సాహంగా నిర్వహించారు. అద్దంకినాంచారమ్మ ఆలయ పాలకవర్గం చైర్మన్ ఆకుల వెంకట్రామయ్య, కార్య దర్శి కూరపాటి కోటేశ్వరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

మచిలీపట్నంటౌన్: నగరంలోని 22వ డివిజన్‌లో ఇటీవల షేక్ మౌలాలి మృతి చెందగా ఆయన భార్య షేక్ మీరాబీకి వైఎస్సార్ బీమా ద్వారా మంజూరైన రూ.10 వేలను ఆ డివిజన్ కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు సోమవారం అందజేశారు. షేక్ మౌలాలి ఈ నెల 4వ తేదీన సహజ మరణం పొందారు. దీంతో వైఎస్సార్ బీమా పథకం ద్వారా మట్టి ఖర్చులకు మంజూరైన రూ.10 వేలను అందజేశారు. మిగిలిన రూ.90 వేలు త్వరలోనే మంజూరవుతాయని తెలిపారు.సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉగాదిలోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

గూడూరు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్లను ఉగాది నాటికి పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చొరవ తీసుకోవాలని గూడూరు ఎంపీడీఓ డి.సుబ్బారావు కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గృహనిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయ ఉద్యోగిని కార్యక్రమంలో భాగస్వాములను చేసి లబ్ధిదారులు వేగంగా ఇళ్లు నిర్మించుకునేలా చైతన్యం తీసుకురావాలనికోరారు. ఉగాది రోజున గృహప్రవేశాలు జరుపుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు.

నేత్రదానం


లక్ష్మీ నాంచారమ్మ (ఫైల్)

చల్లపల్లి: ప్రజలు అంధత్వ నిర్మూలనకు సహకరించాలని వాసవీ క్లబ్ అధ్యక్షుడు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు అన్నారు. గ్రామానికి చెందిన కొత్త లక్ష్మీనాంచారమ్మ మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను ద్రోణ కలిసి నేత్రదానం ప్రాధాన్యత వివరించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది నేత్రాల నుంచి కార్నియాలు సేకరించి తరలించారు.

రోడ్డుకు మరమ్మతులు

గూడూరు: గూడూరు-పెడన ప్రధాన రోడ్డుకు సోమవారం మరమ్మతులు చేపట్టారు. పెడన పురపాలక సంఘానికి తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ ధ్వంసం కావడంతో గూడూరులోని ప్రధాన రహదారి వెంబడి పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. రూ.55 లక్షలతో నూతన పైప్ లైన్ నిర్మాణం చేపట్టినప్పటికీ ట్రయల్ రన్ నిర్వహించలేదు. ఇటీవల పైపుల్లోకి నీరు వదలగానే కొన్ని చోట్ల లీకులు ఏర్పడ్డాయి. పైప్‌లైన్ పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడానికి సమయం పట్టే అవకాశం ఉండటంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా నిర్మాణ పనులు ప్రారంభించలేదు. దీంతో ప్రజల ఇబ్బందులు గుర్తించిన సర్పంచి లింగం సులోచనారాణి జేసీబీ సహాయంతో గోతులు పూడ్చే పనులు ప్రారంభించారు.

ఆర్థికాభివృద్ధికి బ్యాంకులు దోహదం

మచిలీపట్నం ఎంపీ బాలశౌరి


సభలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి

కృత్తివెన్ను: వ్యక్తుల ఉన్నత ఆర్థికాభివృద్ధికి బ్యాంకుల పాత్ర విలువైనదని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. సోమవారం కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం దీవిలో కెనరా బ్యాంకు శాఖను ఎంపీ, రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ గ్రామంలో బ్యాంకు ఉంటే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. మారుమూల గ్రామమైన దీవిలో బ్యాంకు ఏర్పాటుకు తన అభ్యర్థనకు సహకరించిన బ్యాంకు ఎండీ అండ్ సీఈవో కె. సత్యనారాయణరాజుకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ కృషి ఫలితం : మంత్రి

రాష్ట్ర గృహనిర్మాణశాఖా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ఎంపీ బాలశౌరీ కృషితో ఈ గ్రామంలో బ్యాంకు ఏర్పాటైందని కృతజ్ఞతలు తెలిపారు. బందరు పోర్టు నిర్మాణ బాధ్యతలను కూడా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా ఎంపీకి అప్పగించడం గొప్పవిషయమన్నారు. ఇటువంటి వ్యక్తి ఎంపీగా మనకు రావడం అదృష్టమని అన్నారు.

సీఎం ముఖ్యకార్యదర్శి రేవు ముత్యాలరాజు మాట్లాడుతూ తల్లితండ్రుల సమక్షంలో వేదికపై మాట్లాడటం ఎంతో గర్వంగా ఉందని తన తల్లితండ్రులకు సభలో నమస్కరించారు. రాష్ట్రంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు 21.26 లక్షల ఇళ్లు, 30 లక్షల ఇంటి పట్టాలను ఇచ్చే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవడం గొప్పవిషయమన్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ దీవి అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కెనరా బ్యాంకు ఎండీ అండ్ సీఈవో కె.సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఎంపీ కృషి ఫలితంగానే ఇక్కడ బ్రాంచి ఏర్పాటు చేశామన్నారు. కష్టపడితే ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయిని చేరుకోగలర న్నారు.

దానికి నిదర్శనమే తాను, ఈ ప్రాంత వాసి రేవు ముత్యాలరాజు అని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ జాషువా మాట్లాడుతూ బ్యాంకు ఏర్పాటు వల్ల సామాన్యులకు ఆర్థిక సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. జనరల్ మేనేజర్ కళ్యాణి బ్యాంకు అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమవుతున్నాయి

గడప గడప కార్యక్రమంలో పేర్ని కిట్టుతో వృద్ధుడు మన్నే కృష్ణ


మహిళతో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: మీరు నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో మా బందరు కోటలో సమస్యలు చాలా పరిష్కారమవుతున్నాయని ఆ ప్రాంతానికి చెందిన మన్నే కృష్ణ అనే వృద్ధుడు వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)తో పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నగరంలోని 21వ డివిజన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మన్నే కృష్ణ అనే వృద్ధుని ఇంటికి వెళ్లిన సందర్భంలో ఆయన స్పందిస్తూ ఈ కార్యక్రమం వల్ల మా ప్రాంతంలోని పలు సమస్యలు పరిష్కారమవుతున్నాయని బదులిచ్చారు. పలువురు మహిళలు స్పందిస్తూ ప్రభుత్వం ద్వారా తమకు నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. పలువురు వారి వ్యక్తిగత సమస్యల తెలపగా ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారన్నారు.

డివిజన్ కార్పొరేటర్ మన్నే శారద, డివిజన్ ఇన్‌చార్జ్ మన్నే శేషారావు, కార్పొరేటర్లు తిరుమలశెట్టి ప్రసాద్, ఐనం తాతారావు, పార్టీ నాయకులు బూరగ రామారావు, గాజుల భగవాన్, చిత్తజల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి అంచనాలు వేయండి

కోనేరుసెంటర్: గ్రామంలో రోడ్లు అధ్వానంగా మారాయని వాటికి మరమ్మతులు చేయించాలని పలువురు పేర్ని కిట్టును కోరారు. మరికొన్ని ప్రాంతాల్లో రోడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి అంచనాలు తయారు చేయాలని సూచించారు. మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కిట్టు పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాళ్లు సహకరించక అనారోగ్యంతో బాధపడుతున్న ప్రసాద్ అనే గ్రామస్తుడు పరిస్థితిని చూసిన కిట్టు వెంటనే 108 వాహనాన్ని పిలిపించి ఆసుపత్రికి పంపించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ ఆర్ సీపీ మండల కన్వీనర్, మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, గ్రామ కన్వీనర్లు తలారి శ్రీనివాస రావు, లక్ష్మణ్, బాలకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెలాఖరుకు రోడ్డు పనులు ప్రారంభం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: అధ్వానంగా ఉన్న కోడూరు-అవనిగడ్డ రహదారి నిర్మాణానికి టెండర్లు పిలిచి, పనులను ఈ నెలాఖరు నాటికి ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. ప్రస్తుతం ఇస్మాయిల్‌బేగ్‌పేట నుంచి పోటు మీద వరకు జరుగుతున్న డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. కోడూరులోని టీటీడీ కల్యాణ మండపం వద్ద తహసీల్దార్ షేక్ లతీఫ్ పాషా అధ్యక్షతన సోమవారం సభలో మాట్లాడారు.

కోడూరు రహదారి గుంతలమయంగా మారడానికి టీడీపీ పాలకులే కారణమన్నారు. రహదారి నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతోనే ఈ సమస్య తలెత్తిందని చెప్పారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రూ.3 లక్షల సబ్సిడీతో రైతు మిత్ర గ్రూపునకు ట్రాక్టర్ అందజేశారు.

విశాఖపట్నం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు విజయవంతమవ్వడంతో హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, సర్పంచి వెన్నా షైనీ, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వెంకటనారాయణ, ఉపసర్పంచి ఇంకొల్లు మురళీ, బీసీ, ఎస్సీసెల్ కన్వీనర్లు చేబోయిన కృష్ణారావు, వెన్నా ప్రసాద్, కోట పద్మావతి వరప్రసాద్, ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు, ఎంపీటీసీలు, వీఆర్వోలు, సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ తల్లి మృతికి ఎంపీ, మంత్రి నివాళి


అన్నపూర్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ బాలశౌరి, మంత్రి జోగి రమేష్

పెడన: హిందీ పండితురాలు, పట్టణంలోని 21వ వార్డు కౌన్సిలర్ పిచ్చిక సతీష్‌బాబు మాతృమూర్తి అన్నపూర్ణకు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ నివాళులర్పించారు. సోమవారం అన్నపూర్ణ పెద్దఖర్మ కార్యక్రమానికి మంత్రి జోగి రమేష్, ఎంపీ బాలశౌరి హాజరయ్యారు. అన్నపూర్ణ చిత్రపటానికి పూలు జల్లి నివాళులర్పించారు. పట్టణ కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

గూడూరు: మండలంలో ఉప ఎన్నికలు అనివార్యమైన స్థానాలకు పోలింగ్ కేంద్రాల జాబితాలను ఎంపీడీఓ డి.సుబ్బారావు సోమవారం ప్రచురించారు. కోకనారాయణపాలెం సర్పంచి స్థానానికి గ్రామములోని గ్రామ సచివాలయ భవనంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆకులమన్నాడు 2వ వార్డు, పోలవరం 11వ వార్డు ఎన్నికలకు ఆయా గ్రామాల్లోని మండల పరిషత్ పాఠశాల తరగతి గదులను, జక్కంచర్లలోని 1వ వార్డుకు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేశామన్నారు. వివరాలను మండల పరిషత్ కార్యాలయంలో, ఆయా పంచాయతీల్లో ప్రచురించామని, అభ్యంతరాలు ఉంటే మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు తమకు తెలపాలని ఆయన కోరారు.

నేడు అభ్యంతరాల స్వీకరణ

పెడన: స్థానిక పురపాలక సంఘ పరిధిలోని 11వ వార్డు ఉప ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలపై జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపారని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీల నాయకుల నుంచి అభ్యంతరాలు స్వీకరించడానికి మంగళవారం పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు.

సమసమాజ స్థాపనకు కృషి అవసరం

సన్మాన కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి


ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

మచిలీపట్నంటౌన్: కులాలకు అతీతంగా మానవ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బార్ హాలులో విక్టర్‌ప్రసాద్‌ను న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ కలలుగన్న మానవ సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ చేయి కలపాలన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవికి ఎంతో మంది పోటీపడినా, విక్టర్ ప్రసాద్ పార్టీ కోసం కాకుండా దళిత వర్గాలవైపే నిలబడతాడని ఇంటిలిజెన్స్ రిపోర్టులు వచ్చినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తననే చైర్మన్‌గా నియమించారన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎస్ఆర్‌కె ప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ సభలో మాజీ అధ్యక్షుడు వడ్డి జితేంద్ర, రావి వెంకట్రావు, జిల్లా కోర్టు పీపీ వి వరదరాజులు, మాజీ జీపీ గంజి నాగేంద్రం, మాజీ జీపీ గుమ్మడి సుబ్బారావు, న్యాయవాదులు వి.వరదరాజులు, మొవ్వ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణు మాట్లాడారు. విక్టర్‌ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చీలి ముసలయ్య తదితరులు పర్యవేక్షించారు.

నవధాన్యాల సాగుపై అవగాహన


ర్యాలీలో అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు

బొబ్బర్లంక(మోపిదేవి): నవధాన్యాలను భూమిలో వేసి దున్నడం వల్ల భూసారం పెరిగి మంచి దిగుబడులు వస్తాయని కృష్ణాజిల్లా ఐబీ కో-ఆర్డినేటర్ సాయినాథ్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బొబ్బర్లంక గ్రామంలో రైతులతో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసారం పెంచేందుకు నేలలో జనుము, జీలుగలు తదితర మరో 30 రకాల విత్తనాలనువేసి దున్నడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. గ్రామ సర్పంచ్ దొప్పలపూడి గంగాభవానీ, మోపిదేవి యూనిట్ ఇన్‌ఛార్జి పోలాబత్తిన నరసింహారావు, దొప్పలపూడి జగదీష్, పీఆర్పీ బుజ్జమ్మ, ఐసీఆర్పీలు, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, పలువురు రైతులు పాల్గొన్నారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నాగాయలంక(అవనిగడ్డ): నవధాన్యాలను సాగుతో భూమి సారవంతమై సేంద్రియ కర్బనం జీవవైవిధ్యం పెరుగుతుందని ఎంఏవో సంజీవ్‌కుమార్ చెప్పారు. నాగాయలంక మండల పరిధిలోని వక్కచివరలో సోమవారం నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నవధాన్యాలు వేయండి, భూసారం పెంచండి, నవధాన్యాలను సాగు చేద్దాం.. పుడమి తల్లిని కాపాడుకుందాం, కషాయాలు ఉండగా రసాయనాలు దండగ.. అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ చేశారు. వీఏఏ సత్యవాణి, ఎస్‌డీఏ బి.రాంబాబు, ఏపీసీఎన్ఎఫ్ మండల సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

పింఛనర్ల సాయం



మచిలీపట్నంటౌన్: నగరంలోని 28వ డివిజన్ జెండా సెంటర్ ఓగీస్‌పేటలో ఇటీవల మృతి చెందిన కొల్లూరి బుజ్జి కుటుంబానికి తోటి పింఛనుదారులు సాయం అందించి అండగా నిలిచారు. బుజ్జి మృతి చెందటంతో తోటి పింఛనుదారులు రూ.100 చొప్పున సేకరించి వచ్చిన రూ.37,300 మృతుని భార్య విమలకు సోమవారం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ షేక్ మొహమ్మద్ సాహెబ్ చేతుల మీదుగా పింఛనుదారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీ పెద్దలు కొమ్ముకూరి రమేష్, అచ్చెయ్య, పెద్ద ఆదిశేషు, చిన్న ఆదిశేషు, వెంకటేశ్వరరావు, వలంటీర్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంపటాలమ్మ గ్రామ సంచారం

చల్లపల్లి: గ్రామ దేవత శ్రీ సంపటాలమ్మ అమ్మవారి గ్రామ సంచారం భక్తిశ్రద్ధలతో సాగుతోంది. సోమవారం అమ్మవారు పార్వతమ్మ తోట, చల్లపల్లి నారాయణరావు నగర్ ప్రాంతాల్లో సంచరించగా, భక్తులు అమ్మవారికి స్వాగతం పలికి నీరు వారబోసి, పసుపు కుంకుమలు సమర్పించారు. ఆలయ రజక పూజారులు ఉత్సవ మూర్తితో గ్రామంలో సంబరాలు నిర్వహించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక


వైఎస్సార్ సీపీలో చేరిన పడతడిక టీడీపీ నాయకులతో మంత్రి జోగి రమేష్

పెడన: టీడీపీకి చెందిన పలువురు నాయకులు సోమవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ పెడన పట్టణ మైనార్టీ నాయకుడు కమల్‌బేగ్‌కు మంత్రి జోగి రమేష్ వైఎస్సార్ సీపీ జెండా కప్పి ఆహ్వానించారు. కృత్తివెన్ను మండలం పడతడిక గ్రామానికి చెందిన మాజీ సర్పంచి పాలపర్తి ఇస్సాక్, మాజీ ఉప సర్పంచి కటిక పుల్లారావు, అనుచరులు ఇస్మాయిల్, రాజబాబు, మోషే, వాకా ప్రసాద్, సువర్ణరాజు తదితరులు మంత్రి జోగి రమేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి మంత్రి పార్టీ జెండా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీకి కష్టపడి పనిచేస్తామని, సీఎం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు మెచ్చి పార్టీలో చేరినట్లు వారు మంత్రికి వివరించారు. పట్టణ, పెడన నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు ఎండీ ఖాజా, గంగయ్య, మల్లి, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆయా విభాగాల అధ్యక్షులకు మంత్రి సన్మానం.. చేనేత, వాణిజ్య, ముస్లిం మైనార్టీ విభాగాలకు పెడన నియోజకవర్గంలోని ముగ్గురు నాయకులు యర్రా టార్జనరావు, మాతా సుబ్బారావు, అయూబ్‌ఖాన్‌లను ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమని, ఆయా విభాగాలకు గుర్తింపు తీసుకురావాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. వీరిని మంత్రి ఘనంగా సన్మానించి అభినందించారు. పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీఅమలేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ఠ


పూర్ణాహుతిని దర్శించుకున్న మంత్రి జోగి రమేష్ తదితరులు

పెడన: పట్టణంలో నిర్మించిన శ్రీఅమలేశ్వరి దేవి మందిరంలో శ్రీఅమలేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు, హోమాలను వేదపండితులు పడమట బ్రహ్మయ్య, క్రిష్టమ్మ వంశీయులు నిర్వహించారు. శ్రీఅమలేశ్వరిదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించే ప్రాంతంలో పడమట వంశీయులు, ఆడపడుచులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నవధాన్యాలు, చిల్లర, బంగారం, వెండి తదితరాలు వేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పూర్ణాహుతి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్,కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, మెట్ల గోపీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు హాజరయ్యారు. మధ్యాహ్నం అన్న సమారాధనలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నేటి నుంచి అద్దంకి నాంచారమ్మ జాతర

పెదప్రోలు(మోపిదేవి): అద్దంకి నాంచారమ్మ తల్లి అమ్మవారు జాతర ఈనెల 7న నిర్వహించనున్నారు. ప్రతి సంవత్సరం జాతర సందర్భంగా గ్రామ దేవతకు 15 రోజులపాటు సంబరాలు నిర్వహించి ఇంటింటా పసుపు, కుంకుమ, పూలు, పండ్లు వంటి కానుకలు సమర్పించుకుంటారు. ఆలయ ప్రవేశంనాడు పెద్ద జాతర నిర్వహించి అమ్మవారిని ఆలయంకు చేర్చడం పరిపాటిగా వస్తోంది.

మచిలీపట్నం నుంచే గ్రామోత్సవం..

పెదప్రోలులో ఇలవేల్పుగా విశేష పూజలు అందుకుంటున్న నాంచారమ్మ తల్లి తొలుత మచిలీపట్నం నుంచే పూజలు అందుకుంటారని ఓ కథనం ఉంది. గతంలో మచిలీపట్నంకు చెందిన ఓ భక్తుడు పెదప్రోలు భూత వైద్యులు మల్లయ్యను సంప్రదించగా ఆయన సూచనలతో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి సంతానం పొందాడు. నాటి నుంచి అమ్మవారిని వారి ఇంటికి తీసుకెళ్లి పూజలు చేసి ప్రధాన బజారుల్లో మూడు రోజుల పాటు ఊరేగింపు జరిపి పెదప్రోలుకు తీసుకురావడం ఆనవాయితీగా వస్తోంది. ఇంతటి విశిష్టతగల అమ్మవారు దివిసీమ ప్రాంతంలో విశేష ప్రాచుర్యం పొంది భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లుతోంది.

మహంకాళమ్మ తల్లి జాతర ప్రారంభం


ఆలయ ప్రాంగణంలో చండీ హోమం

గూడూరు: మండలం ముక్కొల్లులో కొలువుదీరిన మహంకాళమ్మ తల్లి జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించే జాతరలో భాగంగా ఆలయ మొదటి రోజైన సోమవారం అమ్మ వారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గంగానమ్మ గుడి నుంచి అఖండ జ్యోతి వెలిగించిన అమ్మ వారికి దీపారాధన నిర్వహించారు. అనంతరం అమ్మ వారి రూపంలో ముగ్గు వేసి జీవిత చరిత్ర కథ వినిపించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మ వారికి పూజలు నిర్వహించారు. అమ్మ వారి జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చండీ హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సమ్మెట వేణుగోపాల్, కార్యనిర్వహణ అధికారి టి.వి.వి.మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత

సచివాలయ ఉద్యోగికి ప్రశంసలు


సాహిత్యకు పింఛన్ అందజేస్తున్న వాసుదేవరావు

అవనిగడ్డ: హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కిడ్నీ పేషెంట్‌కు సచివాలయ ఉద్యోగి అవనిగడ్డ నుంచి వెళ్లి పింఛన్ అందజేశారు. అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని తిప్పపాలెంకు చెందిన సాహిత్య కొత్తపేట ఎస్సీ కాలనీలో వలంటీర్‌గా పని చేస్తుంది. ఈమెకు ఒక కిడ్నీ పాడవడంతో చికిత్స తీసుకుంటోంది. వారం రోజుల క్రితం తిప్పపాలెంలో పాముకాటుకు గురవ్వడంతో తొలుత విజయవాడ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు.

ఈమెకు ఒక కిడ్నీ పనిచేయక పోవడం వల్ల మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న అవనిగడ్డ 5వ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గాజుల వాసుదేవరావు హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేశారు. సాహిత్య వలంటీర్ కావడంతో ఈమె పరిధిలోని 25 మందికి వాసుదేవరావు పింఛన్లు ఇచ్చారు. వాసుదేవరావును ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంపీడీవో శైలజాకుమారి, తహసీల్దార్ రామకృష్ణ అభినందించారు.

విజయవాడ ఆస్పత్రిలో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని 29వ డివిజన్‌కు చెందిన చండిక రాజేశ్వరి అనారోగ్య సమస్యతో విజయవాడలోని ఆస్పత్రిలో చేరి శస్త్రచికిత్స చేయించుకుంది. ఆమెకు సామాజిక పింఛనును వలంటీర్ పద్మావతి సోమవారం విజయవాడ ఆస్పత్రికి వెళ్లి పింఛను సొమ్మును అందజేసింది. వలంటీర్ పద్మావతిని ఆ డివిజన్ కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు అభినందించారు.

ఆకట్టుకున్న యూరెకా సైన్స్ ఫెయిర్

కోడూరు: యూరెకా-2023 అంశంలో స్థానిక లక్ష్యా పాఠశాలలో సోమవారం ప్రారంభించిన సైన్స్ ఫెయిర్ విశేషంగా ఆకట్టుకుంది. పలు అంశాలపై విద్యార్థులు ప్రదర్శనలిచ్చారు. సైన్స్ ఫెయిర్‌లో 250 మంది విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ బెస్ట్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించి, విద్యార్థులను అభినందించారు. ప్రగతి విద్యాసంస్థల అధినేత ఎస్. పూర్ణచంద్రరరావు, నవజీవన్ స్కూల్ కరస్పాండెంట్ కే.ఈశ్వరరావు, ఎన్నారై వికాస్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేష్, విద్యానికేతన్ కరస్పాండెంట్ ధర్మప్రసాద్‌లు ఎగ్జిబిషన్‌ను తిలకించారు. పాఠశాల చైర్మన్ విస్సంశెట్టి శివనాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంగళవారం కూడా సైన్స్ ఫెయిర్ కొనసాగుతుందని శివనాగరాజు చెప్పారు.